# పట్టుబడ్డ పీడీఎస్ బియ్యం లారీ



**తెలుగు గళం న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం/ బూర్గంపహాడ్,జూన్ 19**

మండల కేంద్రంలో సాధారణ వాహన తనిఖీల సందర్భంగా బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ లారీని పట్టుకున్నారు.అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు 28 నుంచి 30 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.అనంతరం లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి స్వాధీనం చేసుకున్నారు.ప్రాథమిక విచారణలో లారీ ఆంధ్రప్రదేశ్ నుండి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పీడీఎస్ బియ్యం తరలింపుకు సంబంధించిన పూర్తి వివరాలు, బియ్యం మూలం, యజమానుల వివరాలు మరియు అక్రమ రవాణా కోణంపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## సోమాజిగూడ యశోద లో అదునాతన క్రిటికల్ కేర్ విధానం ఎక్మో ద్వారా వందల కేసులు పరిష్కారం.

**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూన్ 20, ఖమ్మం జిల్లా :**




యశోద మెడికల్ సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ సీనియర్ డాక్టర్ వై.సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, సాధారణ చికిత్సలు సరిపోని పరిస్థితులలో ప్రాణాలను కాపాడటంలో అధునాతన క్రిటికల్ కేర్ విధానాలలో ఎక్మో ఒకటి, శ్వాసకోశ లేదా గుండె వైఫల్యంతో బాధపడుతున్న పేషేంట్లకు, ఎక్స్ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ ఎక్మో లాంటి సాంకేతికతలు ప్రాణాలను నిలబెట్టే పరిష్కారాలుగా మారాయి అని, కృత్రిమ గుండె , ఊపిరితిత్తుల లాగా పనిచేస్తూ, ఎక్మో శరీరంలోని ముఖ్యమైన అవయవాల పనితీరుకు మద్దతు ఇస్తుంది. తద్వారా పేషేంట్ శరీరం కోలుకోవడానికి తగిన సమయం లభిస్తుంది. అలాగే, పారాక్వాట్ విషప్రభావం, డ్రగ్ ఓవర్డోస్ వంటి తీవ్రమైన విషప్రభావాల కేసులను నిర్వహించడంలో ప్రత్యేక డయాలసిస్ మరియు ఎక్మో థెరపీలు ఎంతో ఉపయోగపడుతున్నాయి అని, అన్నారు. మా సోమాజిగూడ యశోద ఆసుపత్రి అధునాతన క్రిటికల్ కేర్ మౌలిక సదుపాయాలు, ఐసీయూ అవేర్నెస్ వంటి కార్యక్రమాల ద్వారా ఆధునిక ఇంటెన్సివ్ కేర్ ప్రాణాలను ఎలా కాపాడుతుంది మరియు రోగులు కోలుకోవడంలో ఇది పోషించే కీలక పాత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు , పరమేశ్, నాగార్జున, బాలకృష్ణ పాల్గొన్నారు .

## పుస్తకాలతో పుట్టినరోజు: రాహుల్ బర్త్‌డేను సేవతో జరిపిన యూత్ కాంగ్రెస్

### పర్వతగిరిలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ,"రాహుల్ కాబోయే ప్రధాని"అంటూ నినాదాలు

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 19**



ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56వ జన్మదినోత్సవాన్ని పర్వతగిరి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, మండల అధ్యక్షుడు గొడుగు వినయ్ మాట్లాడుతూ.. "ఇందిరమ్మ ఆశయ సారథి, రాజీవ్ కలల వారధి రాహుల్ గాంధీ కాబోయే భారత ప్రధాని" అని పేర్కొన్నారు. భారత ఐక్యత కోసం ఆదర్శవంతమైన నాయకత్వంతో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తున్నారని కొనియాడారు.

ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు అంకితభావంతో పని చేస్తున్న నాయకుడని, అణగారిన వర్గాల గొంతుకగా నవభారత నిర్మాణం కోసం ఆయన చేస్తున్న పోరాటం కోట్లాది మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మూడు దేవరాజ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరుకుడు రవీందర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎర్రబోయిన సాంబరాజు యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కత్తుల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

### -- కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ శ్రేణులు

**తెలుగు గళం ఆత్మకూరు, జూన్ 19:**



ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిల ఆదేశానుసారం.. ఆత్మకూర్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ సెంటర్లో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్‌ను కట్ చేసి, ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూచన రవళి రెడ్డి, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి హాజరయ్యారు.

ఈ వేడుకల్లో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శులు కమలాపురం రమేష్, రేవూరి రణధీర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రజనీకార్, దామెర మండల పార్టీ అధ్యక్షులు దుబాసి రాజేందర్, రెండు మండలాల సమన్వయ కమిటీ సభ్యులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల ప్రజాప్రతినిధులు, బూత్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

# నేటి నుండి రైతులకు యూరియా అందుబాటులో

### ఆన్‌లైన్ యాప్ ద్వారా బుకింగ్ తప్పనిసరి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**తెలుగు గళం న్యూస్ హనుమకొండ, జూన్ 19**



ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉందని, రైతులు ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 1.89 లక్షల యూరియా బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవసరానికి మించి నిల్వ చేసుకోకుండా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు.జిల్లాకు మరింత యూరియా నిల్వలు రానున్నాయని తెలిపారు.ఖరీఫ్ సాగు నేపథ్యంలో అన్ని మండలాల్లో డీఏపీ, యూరియా వంటి ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. యూరియా బుకింగ్ కోసం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ యాప్‌లో రైతులు సులభంగా నమోదు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అలాగే ఎరువుల విక్రయ కేంద్రాల్లో యూరియా, ఇతర ఎరువుల నిల్వలు మరియు విక్రయాలకు సంబంధించిన వివరాలను స్పష్టంగా నమోదు చేసే రికార్డులను నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతు వేదికల్లో నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చూడాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా యూరియా ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్ ప్రారంభమైంది. రైతులు మొబైల్ ద్వారా యాప్‌లో ఎలా నమోదు చేసుకుని యూరియా బుక్ చేసుకోవాలో అధికారులు ప్రత్యక్షంగా వివరించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారి కమలాకర్‌తో పాటు 14 మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

### దివ్యాంగుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి, నోట్‌బుక్స్, పండ్ల పంపిణీ చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం నియంతృత్వ పోకడలపై రాజీలేని పోరాటం చేస్తున్న పోరాట యోధుడు, జననాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అత్యంత ఘనంగా జరిగాయి. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైపాల్ రెడ్డిల పిలుపు మరియు ఆదేశాల మేరకు ఈ వేడుకలను నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హెచ్ఎమ్ఆర్‌డీఎస్ దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా, సేవా కార్యక్రమాలతో జరిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో యువజన కాంగ్రెస్ నాయకులు భారీ కేక్‌ను కట్ చేసి పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు.అనంతరం ఆశ్రమంలోని విద్యార్థులందరికీ చదువుకు ఉపయోగపడే నోట్ బుక్స్, పెన్నులు మరియు పండ్లను (ఫ్రూట్స్) పంపిణీ చేశారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశంలో విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా, కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజలను ఏకం చేసిన ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజా సమస్యలపై ఆయన మరింత గళం విప్పుతున్నారని, రాహుల్ గాంధీ దేశ ప్రధాని అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజాసేవలో గడిపే తమ నాయకుడి పుట్టినరోజును ఇలా దివ్యాంగుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ ఘనమైన జన్మదిన వేడుకల కార్యక్రమంలో భూపాలపల్లి అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగునూరి రజినీకాంత్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చుంచుల మహేష్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ బడితల ప్రసాద్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు శ్రీకాంత్, ఉమ్మడి రేగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోయిల క్రాంతి, చిట్యాల మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బొమ్మ కిరణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభుదాస్, కీర్తి రాజు, గణపాక కోటి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.




# ఖరీఫ్‌పై వరుణుడి గండి ఎండిపోతున్న మొలకలు, ఆందోళనలో అన్నదాత

### వర్షాభావంతో నాటిన విత్తనాలు నష్టపోయే ప్రమాదం,ఆకాశం వైపు ఆశగా రైతన్న

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 19**

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా మొదలైనా, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తొలకరి చినుకులతో పొలాలు దున్ని పత్తి, మొక్కజొన్న, కంది, వరి విత్తనాలు నాటిన రైతులకు ఎండలు శాపంగా మారాయి.

మొలకెత్తి ఎండిపోతున్న పంటలు

తొలి వర్షాలను నమ్మి సాగు చేపట్టిన చోట విత్తనాలు మొలకెత్తినప్పటికీ, తేమ లేక మొక్కలు ఎండిపోతున్నాయి. ఇసుక నేలలు, ఎత్తైన భూముల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది."మొదటి వర్షానికి విత్తనం వేశాం.తర్వాత వాన లేదు. మళ్లీ విత్తనాలు కొనే స్తోమత లేదు" అని పర్వతగిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల్లో వర్షం పడకపోతే నష్టం తప్పదు

వ్యవసాయ నిపుణుల ప్రకారం, మరో వారం రోజుల్లో వర్షాలు కురిస్తే కొంత పంటను కాపాడుకునే అవకాశం ఉంది. లేకపోతే మొదటి విడతలో వేసిన విత్తనాల్లో 70% వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. నేలలో తేమ లేక విత్తనాలు పాడయ్యే పరిస్థితి నెలకొంది.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సూచన

ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మొలకలు దెబ్బతిన్న పొలాల్లో పునర్విత్తనం కోసం స్థానిక అధికారుల సలహాలు తీసుకోవాలని కోరారు.రాయితీలు ఇవ్వాలని డిమాండ్





వర్షాభావం కొనసాగితే విత్తనాలు, ఎరువులపై ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని, పునర్విత్తనానికి సహాయం అందించాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. పంట నష్టాన్ని ముందుగానే అంచనా వేసి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే వరుణుడు ముఖం చాటేయడంతో "నాటుకున్న విత్తనాలు పోయినట్టేనా? ఈ ఏడాది పంటలు పండుతాయా?" అనే ప్రశ్నలు రైతులను వెంటాడుతున్నాయి. రానున్న రోజుల్లో సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే అన్నదాతకు ఊరట లభిస్తుంది.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### -కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**తెలుగు గళం న్యూస్ జనగామ, జూన్ 19**





విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కొడకండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), మోడల్ స్కూల్, బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారి విద్యా స్థాయిని తెలుసుకున్నారు.ముఖ్యంగా గణిత బోధనపై ఆరా తీసి విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారి నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. గణితంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహంలోని గదులు, వంటశాల, భోజనశాల, పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్కావెంజర్ అందుబాటులో ఉన్నారా అనే విషయాన్ని కూడా ఆరా తీశారు.విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. తన ఫోన్ నంబర్‌ను పాఠశాల, వసతి గృహ ప్రాంగణాల్లో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ఆవరణలో మొక్క నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కేజీబీవీ, మోడల్ స్కూల్‌లలో అన్ అకాడమీ తరగతులను ప్రారంభించి విద్యార్థులకు స్వయంగా గణితంపై బోధించారు.ప్రతి అంశాన్ని సులభంగా వివరించి విద్యార్థులను ప్రోత్సహించారు.అదే విధంగా విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లు తదితర వస్తువులను పంపిణీ చేశారు.నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీసీడీఓ గౌసియా బేగం, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

